## చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు డీఎం నెప్లీ



మాధవనగర్ చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఎం నెప్లీ

ఖలీల్‌వాడి, మే 8 : ఎన్నికల్లో ప్రలోభాలను నిలువరించేందుకు చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచాలని పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు డీఎం నెప్లీ అన్నారు. పోలింగ్‌కు సమయం సమీపిస్తుండడంతో తనిఖీలు ముమ్మరం చేశారు. మాధవ్‌నగర్ చెక్‌పోస్టును బుధవారం తనిఖీ చేశారు. నిఘా బృందాల పనితీరుతోపాటు రికార్డులను పరిశీలించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అబ్జర్వర్ వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య ఉన్నారు.

## 'బీజేపీ హయాంలో ప్రజల నిలువుదోపిడీ'

డిచ్‌పల్లి, మే 8 : బీజేపీ పదేండ్ల పాటు దేశ ప్రజలను నిలువు దోపిడీ చేసిందని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేసిందని, నల్ల ధనం వెనక్కి తీసుకొస్తామని, అవినీతిని రూపుమాపుతామని, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలను మరిచి, దేవుడు, మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నదని అన్నారు. ప్రజావ్యతిరేక, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఎన్డీఏలను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐఎంఎల్ నాయకులు వెంకన్న, సాయాగౌడ్, మురళి, సాయిబాబా, కిషన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

కోటగిరి, మే 8 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కోటగిరి సెక్టార్ ఆఫీసర్ ప్రమోద్ అన్నారు. కోటగిరిలోని 10 పోలింగ్ కేంద్రాలను బీఎల్‌వోలతో కలిసి బుధశారం పరిశీలించారు. సీసీ కెమెరాతో పాటు తాగునీరు, విద్యుద్దీపాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను పరిశీలించారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ధర్పల్లి, మే 8 : ఈనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు అన్ని గ్రామాల్లోని కార్యదర్శులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ మాలతి అన్నారు. తహసీల్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. చలువ పందిళ్లు వేయాలని, తాగునీరు, ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలర్లు తదితర వసతులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ ప్రవీణ్, ఆర్ఐ రవి పాల్గొన్నారు.

## సీఈఐఆర్ ద్వారా మూడు సెల్‌ఫోన్ల గుర్తింపు

వినాయక్‌నగర్, మే8 : నిజామాబాద్ మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్లను సీఐఈఆర్ పోర్టల్ ద్వారా గుర్తించామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. నగర సీఐ నరహరి సూచనల మేరకు త్రీ పోలీస్ స్టేషన్‌లో బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించగా.. వారు కృతజ్ఞతలు తెలిపారు.

## విశ్వకర్మ సంఘం కార్యవర్గం ఎన్నిక

భీమ్‌గల్, మే 8: పట్టణ విశ్వకర్మ సంఘం (2) కార్యవర్గాన్ని బుధవరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జల మోహన్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కోశాధికారిగా గోపాలపురం లక్ష్మణ్‌చారి, సమాచారం ఇచ్చే వ్యక్తిగా గోపాలపురం మల్లేశం చారిని ఎన్నుకున్నారు. సలహాదారులుగా మందం భూమేశ్వర్, ఘనపురం రమేశ్, జమలిగిరి ముత్తెన్న, రావుట్ల సతీశ్‌ను ఎన్నుకున్నారు.



ఉమ్మడి కోటగిరి మండలంలో మంగళవారం బలమైన ఈదురు గాలులు వీచాయి. పొతంగల్ చెక్‌పోస్టు వద్ద ఓ భవనానికి ఉన్న అద్దాలు ధ్వంసమయ్యాయి.
– కోటగిరి, మే 8



నిజామాబాద్ ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ సాయిశ్యామ్‌ను ఆ శాఖ అధికారులు బుధవారం ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. లోక్‌అదాలత్‌లో భాగంగా ఉత్తమ సేవలందించిన హెడ్‌కానిస్టేబుల్‌ను ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ దిలీప్ అభినందించారు.
– వినాయక్‌నగర్, మే 8

# కాంగ్రెస్, బీజేపీకి బుద్ధిచెప్పాలి

- ఆరు గ్యారెంటీలు లేవు.. పసుపు బోర్డు లేదు..
- అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా
- బాజిరెడ్డికి మద్దతుగా నాయకుల విస్తృత ప్రచారం



గౌతంనగర్‌లో ప్రచారం చేస్తున్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల, నాయకులు



రాణంపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, నాయకులు

ఖలీల్‌వాడి / డిచ్‌పల్లి /ధర్పల్లి/ సారంగపూర్/ ఇందల్వాయి, మే 8: బీఆర్‌ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు బుధవారం విస్తృత ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, పసుపుబోర్డు ఊసే లేదని, ఆ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. జిల్లాకేంద్రంలోని గౌతంనగర్‌లో ఆటోస్టాండ్ నుంచి ఇంటింటికీ తిరుగుతూ బుధవారం ప్రచారం చేశారు. అర్వింద్ పసుపు బోర్డు తెస్తానని చెప్పి, బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఐదేండ్లపాటు కాలయాపన చేశాడని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలతో మోసపోయమని ప్రజలు తెలుసుకొని, మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని అన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, 40వ డివిజన్ అధ్యక్షుడు మెత్కు శివకుమార్, ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, రవిచందర్, తడ్కల్ శ్రీను, గాండ్ల లింగం, డీజీ గోవింద్, భూమేశ్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి మండలంలోని నడ్పల్లి, మెంట్రాజ్‌పల్లి, ఘన్‌పూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాల వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదని కూలీలకు వివరించారు. సీనియర్ నాయకుడు శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీనర్సయ్య, ఒడ్డెం నర్సయ్య, పద్మారావు, నల్లవెల్లి సాయిలు, మహిళా విభాగం అధ్యక్షురాలు పుప్పాల గీత పాల్గొన్నారు.

ధర్పల్లిలో జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్, నల్ల హన్మంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మాజిద్, నజీర్, గంగారెడ్డి, నర్సయ్య, బద్దం నడిపి గంగారెడ్డి, రంజిత్ పాల్గొన్నారు. నగర శివారులోని కాలూర్‌లో ఎంపీటీసీ సభ్యుడు నారాయణ, బీఆర్‌ఎస్ నాయకుడు మాదస్తు ప్రవీణ్, సొసైటీ మాజీ చైర్మన్ దశరథ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఇందల్వాయి మండలంలోని గౌరారం, లింగాపూర్, లోలం గ్రామాల్లో ఎంపీపీ రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, మండల అధ్యక్షుడు దాసు, అంజన్న, గంగాధర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా..**

రుద్రూర్ / చందూర్ / కోటగిరి, మే 8 : బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. రుద్రూర్ మండలం రాణంపల్లిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ప్రచారం చేశారు. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ అందజేశారు. అనంతరం చిక్కడ్‌పల్లి, రాయకూర్ క్యాంపు, సిద్ధాపూర్‌లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, కార్యదర్శి బాలరాజు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ సంగయ్య, అక్కపల్లి నాగేందర్, రమేశ్, గోపాల్, చిక్కడ్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

మోస్రా మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు గడపగడపకూ తిరుగుతూప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పొతంగల్, కోటగిరితోపాటు వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ముమ్మర ప్రచారం చేశారు.

**కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు**

రెంజల్/ మాక్లూర్/ మోర్తాడ్/ ఆర్మూర్‌టౌన్, మే8: కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మళ్లీ మోసపోవద్దని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెంజల్ మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తెలంగాణ శంకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భూమారెడ్డి, మండల నాయకులు కాశం సాయిలు, రాఘవేందర్‌యాదవ్, రఫిక్ పాల్గొన్నారు.



కళ్యాపూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

**కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి**

ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్, ముత్యంపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, మాజీ సర్పంచులు మల్లారెడ్డి, లింగన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో బీఆర్‌ఎస్ ఎంపీ బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఆపార్టీ నాయకులు ప్రచారాన్ని ముమ్మురం చేశారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బాజిరెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు శివలింగు శ్రీనివాస్, గౌతమీ సుమన్, జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు కల్లెడ ఏలియా, రేగుంట దేవేందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 17వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకులు గడపగడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బాజిరెడ్డి గోవర్ధన్ గెలిపించాలని కోరారు.

**నేడు బాజిరెడ్డి గోవర్ధన్ ప్రచారం**

ఆర్మూర్ పట్టణంలో గురువారం 8గంటల నుంచి బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని పార్టీ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.



ధర్పల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు



చౌట్‌పల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

## 'పోస్టల్ బ్యాలెట్'ను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

- ఈనెల 10 వరకు గడువు పొడిగింపు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మే 8 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల (వీఎఫ్‌సీ) ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే గడువును ఎన్నికల సంఘం ఈనెల 10వ తేదీ వరకు పొడిగించిందని జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 8తో గడువు ముగియనుండగా.. మరో రెండు రోజులపాటు గడువు పొడిగించిందని, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహాయ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఈనెల 7 (మంగళవారం సాయంత్రం) వరకు 5548 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. వీరిలో 4014 మంది నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు కాగా.. మిగతా వారు ఇతర 16 పార్లమెంట్ సెగ్మెంట్లకు చెందిన ఓటర్లున్నారని వివరించారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 1758 మంది సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు గాను మంగళవారం సాయంత్రం నాటికి 1696 మంది ఓట్ ఫ్రమ్ హోమ్‌లో భాగంగా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వెల్లడించారు.

## ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలి

బోధన్, మే 8: నాణ్యమైన, ఉచిత విద్యాభ్యాసం కోసం పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు కోరారు. బుధవారం పట్టణంలోని బీటీనగర్, తట్టికోట్ ప్రాంతాల్లో ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న వసతులను వివరించారు. అధ్యాపకులు ఈఎం శ్రీనివాస్, రాములు, జగదీశ్, ప్రఫుల్ల రాణి, సుచిత, సీహెచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

## లక్ష్య సాధన కోసం ప్రణాళికతో చదవాలి




నాలుగు సెమిస్టర్లలో 10/10 గ్రేడ్ సాధించిన సాదియా ఫాతిమాను సన్మానిస్తున్న టీయూ రిజిస్ట్రార్ యాదగిరి

బోధన్, మే 8: విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకొని దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి అన్నారు. బుధవారం పట్టణంలోని రవి గార్డెన్స్‌లో బోధన్ ఉషోదయ డిగ్రీ కళాశాల, ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల, ఇందూర్ ఉషోదయ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం – సాంస్కృతికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. డిగ్రీ నాలుగు సెమిస్టర్లలో 10/10 గ్రేడ్‌ను సాధించిన సాదియా ఫాతిమా, రాష్ట్రస్థాయి కామర్స్ టాలెంట్ టెస్ట్‌లో ద్వితీయస్థానం సాధించిన జాషువా, వరణ్‌ను, ఎన్ఎస్ఎస్ ఉత్తమ వలంటీర్లను టీయూ రిజిస్ట్రార్ యాదగిరి సన్మానించారు. వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ వి.సూర్యప్రకాశ్, డైరెక్టర్లు దుష్యంత్, రమణి, సునీత, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు గంగాధర్, హరికృష్ణ, ఆనంద్‌రెడ్డి, ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, YAMUNA ALETI, W/O. ALETI LINGA REDDY R/O. H.NO.7-22/2/2, VELPUR, (D) NIZAMABAD, CHANGED MY NAME AS ALETI BALAMANI
NTZ-324803

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## సీఎం అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



రాముడి చిత్రపటానికి పూజలు చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, మే8: సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి అయోధ్య రాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం రాముడి చిత్ర పటానికి వారు పూజలు నిర్వహించారు. నాయకుడు నిఖిల్ మాట్లాడుతూ అయోధ్య రాముడిపై ఇలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేడని అన్నారు. అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అక్షయ్, చరణ్, నందు తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు వ్యతిరేకి అర్వింద్‌ను ఓడించాలి'

నందిపేట్, మే 8: లోక్‌సభ ఎన్నికల్లో రైతు వ్యతిరేకి బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను ఓడించాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు మంథని గంగారాం, వి.ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో వారు రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం దేవారాం, మహిపాల్, ఆనంద్, లింగారెడ్డి, గంగాధర్, నరేందర్ పాల్గొన్నారు.

## అంక్సాపూర్‌లో చాయ్‌పే చర్చ

వేల్పూర్, మే 8: అంక్సాపూర్ రైతులు పసుపు పంట సాగులో ప్రసిద్ధి చెందారని బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ అన్నారు. బుధవారం ఆ గ్రామంలో రైతులతో చాయ్ పే చర్చ నిర్వహించి రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైతే రైతుల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు.

## రోడ్లపై గుంతలు పూడ్చిన ఆటో యూనియన్

నందిపేట్, మే 8: మండలంలోని ఉమ్మెడ, మాయాపూర్, బాద్గుణ గ్రామాలకు వెళ్లే రోడ్డుపై ఉన్న గుంతలను ఆటో యూనియన్ సభ్యులు శ్రమదానం చేసి పూడ్చారు. వారు మాట్లాడుతూ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో ఆటోల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని అన్నారు. తరుచూ ఆటోలు చెడిపోయి రిపేర్లు వస్తున్నాయని పేర్కొన్నారు. రోడ్డు మరమ్మతుపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో తామే సొంత ఖర్చుతో గుంతలను పూడ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు అజీమ్, సభ్యులు పాల్గొన్నారు.



గుంతలను మొరంతో పూడ్చివేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

## కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



బాజిరెడ్డితో మల్కాపూర్(ఏ), లక్ష్మాపూర్ నాయకులు

సారంగాపూర్, మే 8 : ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యపర్చాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ), లక్ష్మాపూర్ గ్రామాల నాయకులు, ఆయనను బుధవారం కలిశారు. మాజీ సర్పంచ్ అంకం దాసు, బందెల కిషన్, రాందాస్, రాంరెడ్డి, గురురాజ్, ఎన్నికల ఇన్‌చార్జి జలాల్‌పూర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు బాజిరెడ్డిని కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బాజిరెడ్డి విజయం కోసం కృషి చేస్తామని చెప్పారు. అనంతరం వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, విశ్వబ్రాహ్మణ కులసంఘ నాయకులు బాజిరెడ్డిని కలిశారు.

**బాజిరెడ్డి సమక్షంలో చేరిక..**

సిరికొండ, మే 8 : మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన సిరికొండ మండల కాంగ్రెస్ యూత్ విభాగం అధ్యక్షుడు భూపతిరెడ్డి .. ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో మంగళవారం రాత్రి బీఆర్‌ఎస్‌లో చేరారు. బాజిరెడ్డి ఆయనకు గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## రసవత్తరంగా కుస్తీపోటీలు



కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

చందూర్, మే 8 : మండలంలోని కారేగాంలో బుధవారం కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీపోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన మల్లయోధులకు బహుమతులు ప్రదానం చేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఏర్గట్ల, మే 8: మండలంలోని తడ్‌పాకల్ గ్రామానికి చెందిన నాయకపు శేఖర్ ఇటీవల అనారోగ్యం మృతిచెందగా బాధిత కుటుంబానికి స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ మెంబర్ అష్రాఫ్, మాజీ సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లోలపు అశోక్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల అశోక్‌రెడ్డి, పార్టీ నాయకులు శేఖర్, గంగధర్, మల్లయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా నూతన భవనాలు



కందకుర్తిలో నూతన హెల్త్ సబ్ సెంటర్ ఎదుట చెత్తాచెదారం

రెంజల్, మే 8: మండలంలోని కందకుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఉప కేంద్రం నిరుపయోగంగా దర్శనమిస్తున్నది. గత ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, మహిళా సంఘం భవనాలను నిర్మించింది. సబ్ సెంటర్ నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా అధికారులు దానిని వినియోగంలోకి తేవడం లేదు. ఇరుకుగా ఉన్న పాత జీపీ భవనంలోనే ఆరోగ్య కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఇసుక తరలించిన ఇద్దరికి జరిమానా

శక్కర్‌నగర్, మే 8: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న సంఘటనలో ఇద్దరికి జరిమానా విధిస్తూ బోధన్ న్యాయమూర్తి ఈ.శివసాయి తీర్పు వెల్లడించారు. కోటగిరి పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న బి.శ్రీను అనే కానిస్టేబుల్ విధి నిర్వహణలో భాగంగా తన తోటి కానిస్టేబుల్ పోశెట్టితో కలిసి ఎస్సై ఆదేశాల మేరకు కోటగిరి బండప్ప హనుమాన్ గుడి వద్ద 2020 ఫిబ్రవరి 27న తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా ఓ వ్యాన్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్సై మశ్చేందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు న్యాయస్థానంలో రుజువు కావడంతో వ్యాన్ డ్రైవర్ ధర్మతేజ, యజమాని గంధం నగేశ్‌కు ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఈ. శివసాయి తీర్పు చెప్పారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి ప్రాసిక్యూషన్ జరిపించారు.

## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మాక్లూర్, మే 8: మండలంలోని బోర్గాం(కె) గ్రామానికి చెందిన తెడ్డు పోశన్న (70) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు. ఏఎస్సై కథనం మేరకు.. గతనెల 30న 63వ నంబర్ జాతీయ రహదారిపై మానిక్‌బండార్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. గాయాలపాలైన పోశన్నను స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నడ్పి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

## డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం

ఇందల్వాయి, మే 8 : మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో వివిధ డ్వాక్రా సంఘాల మహిళలతో ఏపీడీ రవీందర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల మహిళలకు స్కూల్ యూనిఫాం కుట్టే అవకాశాన్ని కల్పించామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలో 3,399 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి డ్రెస్ కుట్టేందుకు ఒక్కరికి రూ.50 చొప్పున ఇస్తామని తెలిపారు. సమావేశంలో డీపీఎం సాయిలు, ఏపీఎం సువర్ణ తదితరులు పాల్గొన్నారు.